ప్రజాశక్తి
మంగళవారం 5 మార్చి 2024
5
శ్రీకాకుళం

7న మెళియాపుట్టిలో ఎస్‌టి కమిషన్ పర్యటన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 7న మెళియాపుటి మండలంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డి.వి.జి శంకరరావు పర్యటించనున్నారు. ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం సీతంపేట ఐటిడిఎ కార్యాలయానికి చేరుకుని గిరిజనుల సమస్యలపై వినతులను స్వీకరించనున్నారు. అనంతరం ఐటిడిఎ ఆధ్వర్యాన చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించనున్నారు.

లోకో పైలెట్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటైతే ఉత్తరాంధ్ర ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు కొంత మేర వలసల నివారణకూ దోహదపడుతుంది. ఇది ఎవరూ కాదనలేని నిజం. దీనిని దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర విభజన సందర్భంగా వెనుకబడిన ఈ ప్రాంతంలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి దాదాపు పదేళ్లు గడుస్తున్నా ఆ హామీ అమలుకు దిక్కు లేకుండా పోయింది. బిజెపి చేసిన మోసంపై వైసిపి, టిడిపి నిలదీయకపోగా ఆ పార్టీతో పొత్తు కోసం పోటీ పడుతున్నాయి. కనీసం ఈ ప్రాంతంలో ఉన్నా నాయకులైనా ఈ పదేళ్లలో పోరాడారంటే అదీ లేదు. పైగా ఒక ప్యాసింజర్ రైలుకు హాల్ట్ వచ్చిందని బిజెపి, వైసిపి, టిడిపి సంబరపడిపోతూ ఆ ఘనత తమదంటే తమదంటూ మురిసిపోతున్నాయి. ఇది చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

- ప్యాసింజర్ రైలు హాల్ట్‌పై బిజెపి, వైసిపి, టిడిపి కొట్లాట
- క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయం
- విశాఖ రైల్వే జోన్‌ను వదిలేసి.. ప్యాసింజర్ రైలు కోసం పోట్లాట
- ముక్కున వేలేసుకుంటున్న జనం

ఆ ఘనత మాదే.. కాదు మాదే

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం

బరంపురం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు కొత్తగా మంజూరైన ప్యాసింజర్ రైలు ఇచ్ఛాపురంలో నిలుపుదల క్రెడిట్‌ను అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఖాతాలో వేసుకునేందుకు పోటీపడ్డాయి. రైలు నిలుపుదల తమ పార్టీ గొప్పతనం అంటూ వైసిపి నాయకులు కాలరేగుస్తున్నారు. కాదు కాదు.. తమ పార్టీ ఎమ్‌పి రామ్మోహన్‌నాయడు చొరవ ఫలితమేనంటూ టిడిపి నాయకులు గొప్పలకు పోతున్నారు. తమ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉందని, తమ వల్లే ప్యాసింజర్ రైలు నిలిపారని బిజెపి నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు. ఇచ్ఛాపురం ప్రాంతంలో వారం రోజులుగా పత్రికల్లో ప్రకటనలతోపాటు సోషల్ మీడియాలో ఇవే వాదనలతో హోరెత్తించారు. తాజాగా ఆదివారం రాత్రి తొలిసారిగా ఇచ్ఛాపురం చేరుకున్న బరంపురం ప్యాసింజర్ రైలుకు ఘన స్వాగతం పలికేందుకు పోటీపడ్డారు. లోకో పైలెట్‌కి సన్మానాలూ చేశారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఆధ్వర్యాన వైసిపి శ్రేణులు భారీగా ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో స్టేషన్‌కు చేరుకుని, సందడి చేశారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.నిర్మలారెడ్డి, అసి సత్యం ఆధ్వర్యాన ఆ పార్టీ కార్యకర్తలు అదేరోజు రాత్రి వచ్చి ట్రైన్ డ్రైవర్, స్టేషను మాస్టర్‌కి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. స్టేషన్‌కు రాలేకపోయిన టిడిపి నాయకులు మాత్రం ఖుర్దా డివిజనల్ సమావేశాల్లో ఎమ్‌పి రామ్మోహన్ నాయడు పలు దఫాలుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం వల్లే ఇచ్ఛాపురంలో బరంపురం ప్యాసింజర్‌ను నిలుపుదల చేశారని చెబుతున్నారు

రైల్వేజోన్‌పై అడుగడుగునా మోసమే

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నా... దాదాపు పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం హామీని అమలు చేయడం లేదు. రైల్వేజోన్ ఏర్పాటు కోసం రకరకాల కుంటుసాకులు చెప్తోంది. విశాఖలో రెండు చోట్ల స్థలాలు సిద్ధంగా ఉన్నా రైల్వే జోన్ కోసం స్థలం ఇవ్వడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వంపై నెపం పెడుతోంది. తప్పించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. తాత్కాలిక సిబ్బందినీ కేటాయించలేదు. కేంద్రంలోని బిజెపి సర్కారు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇస్తున్నట్లు ప్రకటించి ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసింది. 200 కిలోమీటర్లలోపు విజయవాడ డివిజన్ ఉండగా, వాల్తేరు రైల్వే డివిజన్ ఎందుకు? అంటూ బిజెపి పెద్దలు వాదించి విజయవాడ డివిజన్ వాల్తేరు డివిజన్‌లో సగభాగాన్ని కలిపించేశారు. మరి విజయవాడకు 40 కిలోమీటర్ల దూరానున్న గుంటూరుకు డివిజన్ ఉన్న విషయాన్ని విస్మరించారు. జోనల్ హెడ్‌క్వార్టర్స్ వచ్చినంత మాత్రాన డివిజన్ ప్రధాన కార్యాలయాన్ని మూసేయ్యాలా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోల్‌కతా మాదిరిగా ఒక జోన్, ఒక డివిజన్ ప్రధాన కార్యాలయం ఒకేచోట ఉంటే తప్పేమిటి? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వైసిపి, టిడిపి ఎమ్‌పిలు ఎవరూ పార్లమెంట్‌లో ఈ తరహా వాదనలను గట్టిగా వినిపించి విశాఖకు రైల్వే జోన్‌తోపాటు వాల్తేరు డివిజన్‌ను యథావిధిగా కొనసాగించే విషయంలో విఫలమయ్యారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. రైల్వే జోన్ హామీ అమలుపై పోరు మానేసి ప్యాసింజర్ రైలు కోసం మూడు పార్టీలు పోట్లాడుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి

రైలింజన్‌కు పూలమాల వేస్తున్న బిజెపి నాయకులు

ధర్నాచేస్తున్న విఒఎలు, సిఐటియు నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలని

కలెక్టరేట్ వద్ద విఒఎల ధర్నా

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విఒఎలకు మెడపై కత్తిలా ఉన్న కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, తదితర డిమాండ్లపై కలెక్టరేట్ వద్ద ఎపి వెలుగు విఒఎల సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేపట్టారు. తొలుత ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, విఒఎల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఒఎల పట్ల చిన్నచూపు చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామ సమాఖ్యల విలీనం ఆపాలని, సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ఫ్ అధికారులే చేయడం సరైనది కాదని చెప్పారు. విఒఎల విలీనం వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విలీనం ఆపి, ఎక్కువ సంఘాలున్న విఒఎల నుంచి తక్కువ సంఘాలున్న విఒఎలకు సర్దుబాటు చేయాలని డిమాండ్‌చేశారు. రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు.

ఇప్పటి వరకు 15 సంఘాలలోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎగా ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వయసు పైబడిన, అనారోగ్యంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలని కోరారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. మహిళా మార్టులో కొనుగోళ్లకు విఒఎలకు లక్ష్యం విధించడం సరికాదన్నారు. రికవరీ పేరుతో వేతనాల కోత విధించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.ప్రకాశ్, విఒఎల సంఘం నాయకులు డి.జోగారావు, ఎం.విమల, సరిత, రోహిణి, జి.ఎర్రయ్య, ఎస్.లక్ష్మి, వై.ద్రౌపది, ఉమ, బి.హేమ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి సన్నిధిలో సినీ గేయ రచయిత సుద్దాల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేషవస్త్రాలు కప్పి సత్కరించారు. చిత్రపటాన్ని ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు.

నెరవేరిన సొంతింటి కల

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని గాజులకొల్లివలస, తిమ్మాపురం లబ్ధిదారులు మండలంలోని సైలాడ వద్ద జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ నియోజక వర్గంలో వివిధ లేఅవుట్లలో 8978 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ప్రతిఒక్కరికీ ఇల్లు ఎంత అవసరమో గుర్తెరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. అర్హులందరికీ ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు ఏర్పాటు చేసుకునేలా తోడ్పాటు అందించారని తెలిపారు. మరి కొన్నాళ్లకు జగనన్న లేఅవుట్లు పెద్ద గ్రామాలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. లే అవుట్లలో ఇప్పటికే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైలాడ దాసు నాయుడు, మొండేటి కూర్మారావు, సంపదరావు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, మున్సిపల్ వైస్ ఫ్లోర్‌లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఎపిఎస్‌ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్లో డ్రైవింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తూ ఉత్తమమైన డ్రైవర్లుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

రాబోయే రోజుల్లో డ్రైవర్ల కొరత ఉన్నందున శిక్షణ తీసుకుంటున్న వారిని ఆర్‌టిసిలో నియమించుకునే వీలుందని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో కూడా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మారిన సాంకేతిక విధానాలతో ప్రతిఒక్కరూ లైసెన్స్ పొందడానికి అవకాశం ఉందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫీజు, ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో ఎస్‌పి రాధిక

జిల్లాకు కేంద్ర బలగాలు రాక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేంద్ర బలగాలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఎస్‌పి రాధిక ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కేంద్ర బలగాలు శ్రీకాకుళం పట్టణ పరిధిలో ఉన్న పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా కేంద్ర బలగాలతో ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు, పోలీస్ సబ్ డివిజన్ల గురించి విపులంగా తెలియజేశారు. ఎన్నికలు సజువుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, సిబ్బంది అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సమన్వయం చేసుకొని పనిచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు వై.శ్రుతి, ఎల్.శేషాద్రి నాయడు, సిఐ సన్యాసినాయడు, తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు భూసేకరణలో

బాధితులకు న్యాయం చేయండి

- స్పందనలో కలెక్టర్‌కు వినతి
- అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలన్న సిఐటియు
- 235 అర్జీలు స్వీకరించిన కలెక్టర్, జెసి

అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మూలపేట పోర్టు భూసేకరణలో ప్లాట్లు కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జెసి నవీన్‌ను కలిసి వినతి అందించారు. మూలపేట పోర్టుకు అవసరమైన రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టిందని, ఆ భూముల్లో గతంలో లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలుగా విక్రయించారని బాధితులు తెలిపారు. ఈ స్థలానికి ల్యాండ్ కన్వర్షన్ కూడా చేయడం వల్ల రూ.లక్షలు చెల్లించి కొనుగోలు చేశామని, అక్కడ కొన్న స్థలానికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువ సెంటుకు రూ.6 లక్షల వరకు నిర్దేశించిందని వివరించారు. కాని పోర్టు యాజమాన్యం, భూసేకరణ సమయంలో రూ.1.30 లక్షలు మాత్రమే చెల్లిస్తామని చెప్పడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

సింగుపురం సమీపంలోని నీలం జ్యూట్ మిల్లుకు రాత్రికి రాత్రే యజమాన్యం లాకౌట్ ప్రకటించిందని, దీనివల్ల పెద్దసంఖ్యలో కార్మికులు రోడ్డు పడ్డారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు అల్లు సత్యనారాయణ కలెక్టర్‌కు వివరించారు. కార్మికులకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడం దారుణమని, తక్షణమే జ్యూట్ మిల్లును తెరిపించి కార్మికులను ఆదుకోవాలని వినతి అందజేశారు.

పొందూరు మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన విశ్రాంత తహశీల్దార్ శ్యామలరావు... తన భూములను సమగ్ర సర్వే సమయంలో తప్పుగా నమోదు చేశారని, వాటిని సరిదిద్దాలని కోరారు. సింగుపురం గ్రామానికి చెందిన ముద్దాడ మల్లేష్.. రీసర్వేలో తన భూమిని మరొకరి పేరుతో నమోదు చేశారని, దీన్ని సరిదిద్దాలని విన్నవించారు.

పలాస మండలం సుమ్మాదేవి గ్రామానికి చెందిన ఇరోతు రాంబాబు , జ్యోతి దంపతులు తమ 9 నెలల వయసున్న కుమార్తె ఫిబ్రనోగేనేని అనే వ్యాధితో బాధపడుతోందని, నెలవారీ మందులు కొనుగోలు చేసుకునే స్థోమత లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, పింఛను మంజూరు చేయాలని వినతి అందించారు. నగరంలోని దూదివారి కోవెల వెనుక నివాసముంటున్న ఎ.నిర్మల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేశారు. స్పందనకు జిల్లా వ్యాప్తంగా 235 అర్జీలు అందాయి.

జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ కూడా వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దొరబాబు, ఎస్‌వి లక్ష్మణమూర్తి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకటరామన్ , డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డిసిహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాశ్, వంశధార ఎస్‌ఇ డోల తిరుమలరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి శిరీషకు అభినందన

ఇటీవల రాంచిలో జరిగిన ఖేలో ఇండియా జాతీయ మహిళా విభాగంలో ఉషు క్రీడలో కాంస్య పతకం కైవసం చేసుకున్న ముద్దాడ శిరీషను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, కోచ్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడమే వైసిపి సిద్ధాంతం

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - కవిటి

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్‌పి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్

రాష్ట్రంలో అభివృద్ధి జాడ ఎక్కడా లేదని, అందినకాడికి దోచుకోవడమే వైసిపి ప్రభుత్వ సిద్ధాంతమని ఎమ్‌పి కె.రామ్మోహన్ నాయుడు విరుచుకుపడ్డారు. కవిటి మండలంలో మాణిక్యపురం, కవిటి బెహరా వీధి, గొండ్యాలపుట్టుగ గ్రామాల్లో సోమవారం 150 కుటుంబాలు ఎమ్‌పి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం సుమారు 40 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని చెప్పారు. అభివృద్ధి అనే పదం పక్కనపెట్టి.. అందిన కాడికి దోచుకో అన్న సిద్ధాంతాన్ని వైసిపి ప్రభుత్వం పాటిస్తోందని విమర్శించారు. అసమర్థ పాలన, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని దుయ్యబట్టారు. బంగారు భవిష్యత్తు ఉన్న రాష్ట్ర యువతరానికి దశ, దిశ లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి - జనసేన విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన జోస్యం చెప్పారు.

ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలని, రాష్ట్రం తిరిగి అభివృద్ధిలో పరుగులు పెట్టాలంటే టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రాజు, టిడిపి నాయకులు మణి చంద్రప్రకాశ్, సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, బెందాళం విజయ్‌కృష్ణ, లోళ్ల శ్రీను, కొర్రాయి వాసుదేవ్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పథకాల అమలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

వైసిపి ప్రభుత్వ హయాంలోనే పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని, రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. సోమవారం మండలంలో కేసుపురం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చెయ్యని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. పథకాలు లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కేసుపురం పంచాయతీలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపిపి దున్న గురుమూర్తి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, కారంగి మోహన్‌రావు, సల్ల దేవరాజ్, బచ్చు జగన్నాథం, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, నీలాపు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

మెమొంటోను అందజేస్తున్న విసి రజని

శ్యామలరావుతో విసి భేటీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజని అమరావతిలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు జ్ఞాపికను అందజేసి వర్సిటీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన రూ.15 కోట్లు నిధులు వేగంగా వర్సిటీ ఖాతాలోకి జమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎయు పాలక మండలి నిర్వహణకు ఏజెండా సిద్ధం చేశామని, తేదీ సూచిస్తే దాన్ని త్వరతగతిన నిర్వహిస్తామని ఆమె తెలిజేశారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేశామని, ఈ విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసురావాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, అసెంబ్లీ సిట్టింగ్ సభ్యులతో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2357 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పాతపట్నంలో అదనంగా ఒక సహాయ పోలింగ్ కేంద్రాన్ని అవసరం మేరకు ఏర్పాటు చేస్తామని అన్నారు. పాతపట్నం పోలింగ్ కేంద్రం నంబరు 291లో 1635 ఓట్లు ఉన్నాయని, 1,500 మంది కంటే అధికంగా ఓటర్లు ఉంటే మిగిలిన ఓటర్లకు మరో సహాయక

సమీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పోలింగ్ కేంద్రం ప్రతిపాదించవచ్చన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు పాత కేంద్రాలను కొత్త చోటుకి మార్పు చేశామని, ఇవి మినహా జిల్లాలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

115 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు

పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలు అప్ గ్రేడ్ కారణంగా జిల్లాలో 115 కేంద్రాల పేర్లు మాత్రమే మారాయని, కానీ, అవి ఉండే స్థానాలను మార్చలేదని ఈ విషయాన్ని గమనించాలని కోరారు. జిల్లాలో అత్యధికంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 42 పోలింగ్ కేంద్రాల పేర్లు మారగా, శ్రీకాకుళం, పలాస నియోజకవర్గాల్లో ఎలాంటి మార్పులు లేవన్నారు. ఆ తర్వాత నరసన్నపేటలో 25, ఆమదాలవలసలో 22, పాతపట్నంలో 11, టెక్కలిలో 8, ఎచ్చెర్లలో 7 పోలింగ్ కేంద్రాల పేర్లు మారినట్టు వివరించారు. వీటిపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో జాబితాను ఆమోదించి పోలింగ్‌స్టేషన్ల హేతుబద్ధీకరణ పూర్తి చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, శ్రీకాకుళం ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, పి), డి.గోవిందరావు (సిపిఎం), రౌతు శంకరరావు, మాధవరావు (వైసిపి), కింజరాపు ప్రసాద్, పి.ఎం.జె.బాబు (టిడిపి), దేసెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), బిర్లంగి ఉమామహేశ్వరరావు, సురేష్ బాబు సింగ్ (బిజెపి) పాల్గొన్నారు.

భర్తపై హత్యాయత్నం కేసులో భార్యకు జైలు

పొందూరు: మండలంలోని లోలుగుకు చెందిన రాంబోతు నాగరాజుపై జరిగిన హత్యాయత్నం కేసులో ఆయన భార్య మొకర లక్ష్మిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యిలు జరిమానాను విధిస్తూ సోమవారం రాజాం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలు మేరకు... 2019 మే 30న భర్త నాగరాజుపై ఆయన భార్య లక్ష్మి హత్యాయత్నంకు పాల్పడడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై బాధితుడి తల్లి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ దేవానంద్ కేసు నమోదు చేయగా, ఎస్ఐ మహ్మద్ యాసిన్ ఆలీ దర్యాప్తు చేసి ఛార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో ఫిర్యాదు తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు.

మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఇబి అధికారులు

300 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- పొందూరు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి ప్రేమకాజల్, ఎస్ఇబి తిరుపతినాయుడు ఆదేశాలు మేరకు పొందూరు ఎస్ఇబి ఎస్ఐ ఈ.రామకృష్ణ ఆధ్వర్యాన సోమవారం తనిఖీలు చేపట్టారు. బాణాం సమీపంలో పి.ముకుందరావు నుంచి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతని వద్ద ఉన్న మద్యం సీసాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ముకుందరావును రిమాండ్‌కు తరలించారు.

సాగు, తాగునీరు టిడిపితోనే సాధ్యం

ఎమ్‌పి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సాగు, తాగునీరు నీరు అందించడం కేవలం టిడిపితోనే సాధ్యపడుతుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పట్టణంలో రతకన్న జగనన్న కాలనీ సమీపంలో పాతాళ సిద్దేశ్వర ఆలయం వద్ద గ్రామీణ నీటి సరఫరాశాఖ ఆధ్వర్యాన నిర్మించిన వాటర్ టాంక్ లీకేజీలు స్థానిక ఎమ్మెల్యే అశోక్, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి సోమవారం పరిశీలించారు. వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వాటర్ స్కీమ్ ఇచ్ఛాపురంలో నిర్మించిన ట్యాంకరును పరిశీలిస్తే ఎంత నాసిరకంలో

ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

నిర్మించారో చూస్తే అర్ధమవుతుందని అన్నారు. కొండపైన నిర్మించిన క్లయింట్ ఓవర్ హెడ్ ట్యాంక్ ఓవర్ ఫ్లో కావటంతో కింద ప్రదేశంలో నిర్మించిన ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, లీలారాణి , సహదేవ్‌రెడ్డి, దక్కత ఢిల్లీరావు, కాళ్ల జయదేవ్, కోటి, రెయ్యి జానికిరావు, కె.ధర్మారావు, సంతోష్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు?

ప్రజాశక్తి- పలాస

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ కావడం లేదని, ధాన్యం డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారని పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి గోవిందరావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడీ పంటపై కురుస్తున్న మంచు వల్ల పూత పూర్తిగా నాశినమైందని, పంటలకు బీమా స్కీమ్ అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తిత్లీ తుపానుతో నష్టపోయిన ఏడు వేల మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు రైతులకు అనుంధానం చేయాలన్నారు. జీడి పిక్కల సీజన్ ప్రారంభమైందని, 80 కేజీల బస్తా రూ.16 వేలు మద్దతు ధర కల్పించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. పదేళ్లుగా ఇరిగేషన్ కాలువలు, మదుములు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోరారు. చెరువులు ఆక్రమణలకు గురికావడంతో పూర్తిస్థాయిలో పంట భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార, బాహుదా నదుల అనుసంధీకరించి ఉద్దానం ప్రాంతానికి నీరు విడిచిపెట్టాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, నల్ల అడ్డి మాస్టర్, మద్దెల ధర్మారావు, కారి పురుషోత్తం పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

విశ్రాంత హోంగార్డుకు సన్మానం

శ్రీకాకుళం: హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తిస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన అరిక నూకయ్యను జి.ఆర్.రాధిక జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ప్రశంసాపత్రాన్ని అందజేసి, తక్షణ ఆర్థిక చేయుతగా రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎటువంటి సహాయం అవసరమైనా పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్.గోపీనాథ్, ఆర్ఐ డి.సురేష్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఐతమ్ కళాశాల ఇసిఇ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్ఎస్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష కుమార్ పాగోటి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పేడాడ కామేశ్వరరావు సంయుక్తంగా డిజిటల్ లాజిక్ డిజైన్ అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తన ఛాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా పుస్తకం విశేషాలు వివరించారు. ఇసిఇ, సిఎస్ఇ, ఐటి, సిఎస్ఎం, ఇఇఇ బ్రాంచుల మొదటి, ద్వితీయ ఏడాది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ డి.ఆజాద్, ఇసిఇ హెడ్ డాక్టర్ బి.రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిడి త్రినాథస్వామి

ఆరుతడి పంటలపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతులు వ్యవసాయ అధికారులు సూచనలతో భూ సారాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డిడి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని యర్రవరం పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ఆత్మ, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా ఆరుతడి పంటలపై, వేసవి పంటలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న రెండు పంటలుగా వేయడంతో చీడపీడలు ఉధృతం అవుతాయని అన్నారు. చివరిగా దిగుబడిపైనా ప్రభావం చూపుతుందని అన్నారు. పంటలు మార్పిడి చేయాలన్నారు. రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు, ఆమదాలవలస కెవికె, ఎస్ఎంఎస్ డాక్టర్ ఎస్.అనూష మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కేవలం యూరియానే కాకుండా పోటాష్, భాస్వరం ఎరువులు వాడకం వాటి ఆవశ్యకమన్నారు. మొక్కజొన్నలో చీడ పీడల యాజమాన్యం గురుంచి వివరించారు. డిఆర్‌సి శాస్త్రవేత్త, ఎఒలు వై.సూర్యకుమారి, ఎ.భానుప్రియాంక, కె.భాగ్యలక్ష్మి, డి.విజయ్‌భాస్కర్ నువ్వు పంట యాజమాన్యానికి నేలలో సేంద్రీయ కర్బన శాతం అభివృద్ధి పరిచే విధంగా రైతులందరూ భూసార పరిరక్షించే చర్యలు తీసుకోవాలనిసూచించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

అక్కుపల్లిలో గుడ్ మార్నింగ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైసిపి విజయానికి గ్రామస్థాయి నుంచి సమిష్టిగా కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సూచించారు. అక్కుపల్లిలో గుడ్ మార్నింగ్ అక్కుపల్లి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. అందరికీ అన్నీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు బర్రి భూపతి, వెంపళ్ల యోగి, కోడ సోమేశ్వరరావు, కర్రి తిరుపతిరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పోలీసుస్టేషన్‌కు సోమవారం పదో తరగతి ప్రశ్నపత్రాలు చేరాయి. ఎంఇఒ పట్నాన రాజారావు పర్యవేక్షణలో స్టేషన్ హౌస్ ఆఫీస్ కస్టోడియన్లు ఎం.అరుణ, పూజారి హరిప్రసన్న వాటిని భద్రపర్చారు. మంగళవారం సెట్-2 ప్రశ్నపత్రాలు వస్తాయని ఎంఇఒ తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధి సిబ్బంది నిరసన

పొందూరు : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలంగా ఉపాధి హామీ విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులు తమకు వేతనాలు పెంచాలని, గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని, పిఆర్‌సి వర్తింపజేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్లతో నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయాన నిరసన తెలిపారు. జెఎసి చైర్మన్ వై.వి.రమణ ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్నామన్నారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రత్నాకర్, సుజాత, బి.వి.రమణమూర్తి, అరుణ, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇందులో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారిలో కేవలం ఎపిఒలకు మాత్రమే గ్రేడ్ ఫిక్సన్ చేశారని, మిగిలిన ఇసి, టిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఎటువంటి జీతాలు పెంపుదల చేయలేదని వాపోయారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు టి.నటరాజ్, పి.పాపారావు, ఎన్.ఈశ్వరరావు, జగన్, కంప్యూటర్ ఆపరేటర్లు గోవిందరాజు, బి.చంద్రశేఖర్, ఎన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని ఉపాధి కార్యాలయంలోని ఉద్యోగులు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైమావతి, పి.రమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న ఉపాధి ఉద్యోగులు

నూతన ఓటర్ల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్

టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూర్యం

మాట్లాడుతున్న సూర్యం

ఆమదాలవలస : నియోజకవర్గంలో నూతనంగా నమోదైన ఓటర్ల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఏడుగురు సభ్యులతో ఎపి వారియర్స్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బోర గోవిందరావు, బూర్జ మండలం నుంచి ఆనెపు రామకృష్ణ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, సరుబుజ్జిలి మండలం తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు, పొందూరు మండలానికి చెందిన బలగ విజయ శంకర భాస్కరరావు, చింతాడ వాసుదేవరావు స భ్యులుగా ఉన్నారని చెప్పారు. ఆమదాలవలస నియోజక వర్గంలో సుమారు 14 వేల మంది యువతి యువకులు ఓటర్లుగా నమోదయ్యారిన తెలిపారు. టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడితే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో కల్పించడానికి చర్యలు చేప డుతున్నట్లు వివరించారు. సమావేశంలో బోర గోవింద రావు, మెట్ట సుజాత, తాడేల రాజారావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై స్పీకర్ మాటలు హాస్యాస్పదం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి నాయకులు చేస్తున్న భూదందాలు వివిధ రకాల దోపిడీల్లో మొదటి స్థానంలో ఉన్న స్పీకర్ తమ్మినేని సీతారాం భూ ఆక్రమణలంటూ కూన రవికుమార్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి మండల పార్టీ నాయకులు నూకరాజు, బోర గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ మండిపడ్డారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీతారాం ఆదివారం పట్టణంలోని కృష్ణాపురం వద్ద జరిగిన సమావేశంలో రవికుమార్ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద భూ ఆక్రమణలకు ప్రయత్నించారంటూ తప్పుడు ప్రచారం చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్స్ భాగంలో ప్రభుత్వ భూములను లీజు పద్ధతిలో పరిశ్రమల స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అప్పటి టిడిపి

మాట్లాడుతున్న నూకరాజు

ప్రభుత్వంలో రవికుమార్ వెన్నెలవలస వద్ద ఉన్న ప్రభుత్వ భూములను దరఖాస్తు చేశారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రవికుమార్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని టిడిపి ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్పీకర్ ఇప్పుడు రవికుమార్ భూ ఆక్రములకు పాల్పడుతున్నట్లు ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

శివరాత్రి పటిష్ట బందోబస్తు

ఎస్‌పి రాధిక

జలుమూరు : మహాశివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగం ఆలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి జిఆర్ రాధిక తెలిపారు. శ్రీముఖలింగం ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఎస్‌పి పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. యాత్రికుల దర్శన మార్గాలను పరిశీలించి, ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఉచిత క్యూలైన్‌లో యాత్రికులు ఎక్కువ సమయం ఉండకుండా త్వరగా దర్శనానికి అనుమతించాలని ఆదేశించారు. చక్రతీర్థ స్నానాలలో ముఖ్యంగా తోపులాటకు తావు లేకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా, స్వామి వారు వెళ్ళే మార్గంలో, నదీ పరివాహక ప్రాంతాలలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుండి ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ అమలు చేస్తామన్న వారికే మద్దతు

నందిగాం: ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకే తమ మద్దతునిస్తామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు ప్రకటించారు. సోమవారం ఓట్ ఫర్ ఒపిఎస్ ప్రచార పత్రాలను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగించే జిపిఎస్‌ను రద్దుచేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.,కుమారస్వామి, వై.గణపతి, కె.సురేష్‌కుమార్, ఎన్.శివప్రసాద్, టి.అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శివాజీ విరాళం

సోంపేట: సోంపేట పట్టణ శ్రీశయన సంక్షేమ సంఘానికి మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర శివాజీ అంతిమ యాత్ర రథాన్ని విరాళంగా అందించారు. పట్టణంలోని వీధులకు శ్మశాన వాటిక దూరంగా ఉందని, దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పట్టణ శ్రీశయన సంఘ అధ్యక్షుడు రెల్ల నారాయణ, బీన ఆనంద్ శివాజీని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆయన సుముఖత వ్యక్తం చేస్తూ తన తండ్రి సర్దార్ గౌతు లచ్చన్న జ్ఞాపకార్థం అంతిమ యాత్ర వాహనం అందిస్తానని అన్నారు. దీన్ని పేదలకు సద్వినియోగం అయ్యేలా చూడాలని శివాజీ కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెల్ల జయరాం, పొందూరు దామోదరం, గేదెల భీమారావు,రాము, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

పట్టాలను చూపిస్తున్న లబ్ధిదారులు

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ చేస్తున్న ఘనత ఒక్క సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డే దక్కుతుందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అన్నారు. తన వార్డు పరిధిలో 40 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌తో ఇళ్ల పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకు అందించడం ద్వారా జగన్ పాలనా తీరు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బర్ల లక్ష్మణరెడ్డి, పటాన కృష్ణారావు, పటాన నీలాద్రిరెడ్డి, పటాన హరికృష్ణ, నందికి, సోమేష్ పాల్గొన్నారు.

రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

డిప్యూటీ డిఇఒగా రామకృష్ణ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా నక్క రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గార ఎంఇఒగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు ఉద్యోగోన్నతి ప్రభుత్వం కల్పించడంతో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఉపవిద్యాశాఖ కార్యాలయ సిబ్బంది బెనర్జీ, కుప్పిలి నగేష్, ప్రకాష్‌లు స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఆర్.విజయకుమార్ యథాస్థానం శ్రీకాకుళం డిప్యూటీ విద్యాశాఖాధికారిగా వెళ్లిపోయారు. ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు సంఘం కార్యవర్గ సభ్యులు చిలుకు కృష్ణారావు, హరిబాబు, ఆమ్మనమ్మ కలిసి అభినందించారు.

మాట్లాడుతున్న కృష్ణమూర్తి

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం సర్కిల్‌లో భాగంగా లైన్‌మేన్ దివాస్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి 85 మంది ఫీల్డ్ సిబ్బందికి జాతీయస్థాయి అవార్డులను బహూకరించారు. ఈ మేరకు అవార్డులకు ఎంపికైన మీసా రామస్వామి, ఆమదాలవలసకు చెందిన లైన్‌మెన్‌కు సోమవారం సూపరింటెండెంట్ ఇంజినీర్ దాగిరెడ్డి కృష్ణమూర్తి అధ్యక్షతన అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణలో భద్రతాపరమైన అన్ని నియామకాలను పాటిస్తూ... వినియోగదారులందరికీ న్యాయమైన సేవలున అందించాలన్నారు. పనిచేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ... అప్రమత్తంగా ఉండాలన్నారు.

మాట్లాడుతున్న ప్రసాదరావు

చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి- లావేరు

చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారుపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు అన్నారు.

మండలంలోని తాళ్లవలసలో జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి, నాబార్డు ఆర్థిక సహాయంతో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై మహిళలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు సర్వీసు ప్రాంతాల్లో ఉన్న బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామని అన్నారు. 30 స్వయంశక్తి సంఘాలకు చెందిన మహిళలను ఎంపిక చేసి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, కె.వి.ధర్మారావు, గంట్యాడ అప్పలనాయుడు, స్వప్న, సిఇఒ శ్రీనివాసరావు, దుర్గారావు పాల్గొన్నారు.

కొత్తపేట రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల
మండలంలోని కొత్తపేట నుంచి ఎస్‌ఎస్‌.పురం తారు రోడ్డు నిర్మాణానికి రూ.85 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కొత్తపేట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు మార్గం గుంతలుగా ఏర్పడడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరు కావడంతో త్వరలో బిటి రోడ్డు నిర్మిస్తున్నామని అన్నారు. కొత్తపేట సర్పంచ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొడ్డేపల్లి సుధాకర్, మండల యువజన విభాగం అధ్యక్షులు కొత్తకోట సూర్యారావు, ఎచ్చెర్ల మండలం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్లు ఎంతో కీలకమని డిసిఐ బాలాజీ నాయక్, డ్వామా పీడీ డి.చిట్టిరాజు అన్నారు. జెడ్‌పిలో పోస్టల్ బ్యాలెట్లపై అధికారులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ల తయారీ, జారీ, స్వీకరణలో ఎక్కడ చిన్న పొరపాటు జరగకూడదని స్పష్టం చేశారు. అన్ని దశల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తుచ తప్పకుండా పాటిస్తూ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఫారం-12, ఫారం-13 ఎబిసిడిలు నింపే ప్రక్రియపై అవగాహనా తదితర అంశాలపై అనుమానాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణలో డిటిలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్

ప్రజాశక్తి- పలాస
రానున్న ఎన్నికల్లో బిజెపి, దానిమిత్ర పక్షాలకు వ్యతిరేకంగా పలాస నియోజకవర్గంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఎన్నికల బరిలో ఉ oటుందని ఆ పార్టీ నాయకులు తామాడ సన్యాసిరావు, పోతనపల్లి అప్పారావు, పోతనపల్లి కామేశ్వరావు, దున్న శ్రీనివాసరావులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో నియంతృత్వ ప్రభుత్వ పాలన సాగిస్తుందని అన్నారు. ఇది ప్రజాస్వామిక సంస్థలను, రాజ్యాంగ సంస్థలను చేజిక్కించుకొని ఎదిరించిన రాజకీయ శక్తులపై ఎన్‌ఐఎ, ఇడి, సిబిఐ సంస్థలను ప్రయోగించి వారిని వేధింపులకు గురి చేస్తుందన్నారు. పార్లమెంట్‌లో జవాబితనం లేకుండా విస్తృత ప్రజానీకానికి సంబంధించిన సమస్యలను ఏకపక్షంగా ప్రజలపై రుద్దుతున్నారని ఆరోపించారు. స్వాంతత్రం అందిన రాజ్యాంగాన్ని వలసవాద రాజ్యాంగంగా అభివర్ణించి మనువాద రాజ్యాంగాన్ని అమలు పరుచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి పార్టీలను బుద్ధిచెప్పాలని అవసరం ఉందన్నారు. వారితో పాటు జి.జగదీష్, రాజారావు, కుత్తుం లోకనాధం, జగన్, కోటేశ్వరరావులు ఉన్నారు.

మహిళా సంఘాలతో ప్రకృతి వ్యవసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస
మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టనున్నట్లు మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంతో తయారు చేసిన బెల్లం స్టాల్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలపై ఎంతో నమ్మకంతో ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు అవగాహన కల్పిస్తూ, అమలు పరిచే బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని గ్రామ సంఘాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు అవసరమైన శిక్షణలు ఇప్పించి ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడకుండా దేశవాళీ ఆవుల పెంపకం పశువుల ఎరువు, పెంటగత్తం, వర్మీకంపోస్టుల వినియోగం ద్వారా పంటలను పండించి ప్రజల ఆరోగ్యానికి దోహదపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, సుభద్ర, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

12న ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
దశాబ్దాల పాటు పరిపాలించిన నేతల నిర్లక్ష్యం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, పాలక, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని నష్టం చేకూర్చిన బిజెపితో జతకట్టి ప్రజలకు అన్యాయం చేశారని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర ఆరోపించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సంఘం ఆధ్వర్యాన ఈ నెల 12న ఉత్తరాంధ్ర అభివృద్ధిపై జరగబోవు సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా నేటికీ ఉత్తరాంధ్ర నుంచి వలసలను అరికట్టలేక పోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య విధానాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు గోపి నాయుడు, రాము, బంగారు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మెళియాపుట్టి
ప్రమాదానికి గురై బాధపడుతున్న అచ్చినాపురానికి చెందిన సవర యువరత్నకి గిరిజన చైతన్య వేదిక మండల శాఖ అధ్యక్షులు జన్ని కూర్మారావు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున పొందుతున్న బాధితుడికి రూ.24,702 వైద్య ఖర్చు కోసం ఆర్థికసాయం అందించారు. దాతలు స్పందించి బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న హరీష్

హరీష్‌కు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
సమాజం దృక్పథకోణాన్ని ప్రతిబింబించే రీతిలో సామాజిక చిత్రకారుడు గంగరాపు హరీష్ గీసిన చిత్రాలు ఉన్నాయని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో హరీష్ గీసిన చిత్రాలను జెసి నవీన్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. చిత్రకారుడు హరీష్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు. మారుమూల ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన చిత్రాలను ప్రదర్శించాలని, అప్పుడు ప్రతిభకు గుర్తింపు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో హరీష్ తండ్రి సింహాచలం, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిఆర్‌ఒ గణపతిరావు పాల్గొన్నారు.

పథకాలపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి- కవిటి
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ దిశానిర్దేశం చేశారు. మండలంలోని వైసిపి నాయకులతో కవిటిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం త్వరితగతిన బూత్ కమిటీలు నియమించి గ్రామాల్లో ప్రతి ఇంటినీ సందర్శించాలని సూచించారు. ముఖ్యంగా బూత్ కమిటీ సభ్యులు నియమించేటప్పుడు పార్టీ సూచనలు తప్పకుండా పాటించాలని అన్నారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, ఎఎంసి వైస్‌చైర్మన్ యలమంచి నీలయ్య, ఎఎబి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి, జెసిఎస్ అధ్యక్షుడు జల్లు యుగంధర్ పాల్గొన్నారు.

సిపిఆర్‌పై వాకర్స్‌కు అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
అధిక రక్తపోటు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సిపిఆర్ చేయించుకుని గుండెపోటు రాకుండా నివారించడానికి వీలవుతుందని వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం స్కూల్ ఆవరణలో జెసిఐ సంస్థ మిషన్ పునర్జీవన్ కార్యక్రమంలో భాగంగా వాకర్స్‌కు సిపిఆర్‌పై సోమవారం అవగాహన కల్పించారు. జెసిఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ సంస్థ నిర్వాహకులు గీతాశ్రీకాంత్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో గుండె ఆగిపోకుండా ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి వ్యక్తిని బతికించవచ్చన్నారు. ప్రాథమిక చికిత్సలో భాగంగా సిపిఆర్ చేసే విధానాన్ని వాకర్స్‌కు వివరించారు. ఇటీవల ఎక్కువ మంది గుండె పోటుకు గురై మృతి చెందుతున్నారని, అటువంటి సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించి ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు వీలవుతుందని అన్నారు. కార్యక్రమంలో జెసిఐ సన్ రైజర్స్ ఛాప్టర్ ప్రతినిధులు బగాది ప్రవీణ్, సింగూరు ప్రవీణ్, వెంకటేష్, సుదర్శన్, జైబాబా, దూసి సంతోష్, జెన్‌కె ట్రస్టు చైర్మన్ ఉర్లాన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ప్రతి ఇంటా జరిగే వేడుకల్లో మిగిలిపోయిన భోజనాలను తమకు అందజేస్తే వాటిని పట్టెడు అన్నం కోసం ఎదురు చూసే నిరుపేదలకు అందజేస్తామని మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు, సామాజిక సేవలకు ఉర్లాం శివతేజ అన్నారు. నగర శివారులోని ఎస్ కన్వెన్షన్‌లో ఓ వేడుకలో మిగిలిన ఆహారాన్ని సోమవారం సంస్థ సభ్యులు స్వీకరించారు. కార్యక్రమంలో మదర్స్ లవ్ ఫౌండర్ రౌత్ సుప్రజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి పొడుగు చరణ్ పాల్గొన్నారు. ఎక్కడైనా ఆహారం మిగిలి ఉంటే 87909 44902, 94925 89534, 97016 98408 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆహారాన్ని సేకరిస్తున్న సభ్యులు

పట్టుబడిన వాహనాలతో పోలీసులు

హడ్కో కాలనీలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి- ఆమదాలవలస
పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలసలోని హడ్కో కాలనీలో సోమవారం తెల్లవారుజామున సిఐ జి.దివాకర్ యాయనందన్ ఆధ్వర్యాన పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలను, అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అన్ని రకాల పత్రాలను సరిచూసుకొని వాహనాలను నడపాలన్నారు. ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాల్లో పత్రాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేసే వ్యక్తుల నుంచి ఎటువంటి వాహనాలను కొనుగోలు చేయకూడదని అవగాహన కల్పించారు. ఈయన వెంట ఆమదాలవలస, సరుబుజ్జిలి ఎస్‌ఐలు కె.వెంకటేష్, ఐ.నాగరాజు, బి.నిహార్ ఉన్నారు.

వాలంటీర్ ఔదార్యం

ప్రజాశక్తి- సోంపేట
మండలంలోని మామిడిపల్లి బిసి కాలనీకి చెందిన సైకిల్ మెకానిక్ నౌపాడ మోహనరావు డయాబెటిస్ వ్యాధికి గురై బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందజేస్తున్న పింఛను డబ్బులు వారికి ఏ మేరకైనా ఉపయోగపడతాయన్న ఆలోచనతో వాలంటీరు దున్న అరుణ తన సొంతడబ్బులు ఖర్చు పెట్టికొని మోహనరావుకి సోమవారం పింఛను అందజేశారు. వాలంటీరు సేవలను సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపిటిసి దున్న మాధవరావు, యూత్ లీడర్ నాని అభినందించారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

ప్రజాశక్తి- రణస్థలం
జనవరి 27 భీమిలిలో జరిగిన సిద్ధం బహిరంగ సభకు వెళ్తూ... ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన ప్రయివేటు బస్సు క్లీనర్ ఉప్పాడ లక్ష్మణరావు బైరు కింద పడి మృతి చెందారు. అప్పట్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి మృతునికి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో రూ.2 లక్షల చెక్కు మంజూరు కావడంతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సోమవారం మృతుడి భార్య శాంతికుమారికి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

40 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి
మండలంలోని రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంది రోగులకు వైద్యులు కణిత కేశవరావు, ఎ.శ్రీరాములు కంటి, చెవి, ముక్కు, గొంతు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని జాతీయ సేవా శిబిరం పిఒ డాక్టర్ కంది గోల్డ్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రామారావు పాల్గొన్నారు.